రథయాత్రకు ఆహ్వానం అందజేత



కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద ఇస్కాన్ దేవస్థాన సభ్యులు ఆయనకు శనివారం ఆహ్వానపత్రం అందజేశారు. ఈ నెల 27న నిర్వహించే జగన్నాథ్ రథ యాత్రలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఇస్కాన్ దేవస్థాన సభ్యులు, నిర్వాహకులు విద్యాకల్పన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాధిక, మాధురి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ ఉషారాణి అన్నారు. శనివారం చింతల్‌లోని రామ్‌కీ అపార్ట్‌మెంట్‌లో ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుపంచర్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉచిత ఆక్యుపంచర్, దంత వైద్య శిబిరం, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కిడ్నీ పరీక్షలు నిర్వహించినట్లు ఉషారాణి పేర్కొన్నారు. శిబిరంలో ఆక్సిడెంటల్ కేర్ వైద్యురాలు డాక్టర్ మాధురి, ఏషియన్ ఇనిస్టిట్యూట్ వైద్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



చింతల్: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రశాంత్‌నగర్ సబ్ స్టేషన్ రాజీవ్‌గాంధీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత్ నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, సీఎంసీ, ప్రశాంత్‌నగర్ సబ్ స్టేషన్ అపోజిట్, రాఘవేంద్ర ఆఫీస్, ప్రాగా టూల్స్ సబ్‌స్టేషన్ ప్రగతిప్యాక్ ఫీడర్ పరిధిలో యాక్సిస్ కంపెనీ, ఎంఎస్ ఇంజనీరింగ్ వర్క్స్, ఆర్అండ్‌డీ ఇంజనీరింగ్, ఎస్ఎస్ ఇంజనీరింగ్, ప్రగతి ప్యాక్ ఇండస్ట్రీస్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ శక్తి పురం ఫీడర్ పరిధిలో శ్రీసాయి నగర్, ఇందిరానగర్, టైం టెక్ ఇండస్ట్రీస్, ఎస్వీకే లాజిస్టిక్స్, ప్రాగా టూల్స్ సబ్‌స్టేషన్ రసూల్ పార్మా ఫీడర్ పరిధిలో రసూల్ పార్మా, ఐడీఏ కూకట్‌పల్లి, ఐడీఏ గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాజులరామారం టౌన్‌ప్లానింగ్ అధికారిగా సుమిత్ర

కుత్బుల్లాపూర్: జీహెచ్ఎంసీ పరిధిలోని పలు సర్కిళ్లలో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు బదిలీ అయ్యారు. గాజులరామారం టౌన్‌ప్లానింగ్ అధికారిగా పి.సుమిత్ర బాధ్యతలు చేపట్టనున్నారు. అదే విధంగా పటాన్‌చెరు సర్కిల్ చెందిన టీపీఎస్ పి.మధు కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. కుత్బుల్లాపూర్ టీపీఎస్‌గా పని చేస్తున్న పి.రమేష్ చందానగర్ సర్కిల్‌కు, గాజులరామారం డీఎం తుల్జాసింగ్ ఉప్పల్ సర్కిల్‌కు, కుత్బుల్లాపూర్ సర్కిల్ టీపీఎస్ ప్రభావతి కర్వాన్ సర్కిల్‌కు బదిలీపై వెళ్లనున్నారు. శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుకు అండగా ప్రభుత్వం

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా పథకంతో అన్నదాతకు ప్రభుత్వం అండగా ప్రభుత్వం నిలుస్తోందని, మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా శనివారం వరకు మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లాలోని 5,015 మంది రైతుల ఖాతాల్లో రూ. 4.23 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విడతల వారీగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతు భరోసా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వర్షాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

కాలం చెల్లిన బస్సులే అధికం!

- జిల్లాలో విద్యా సంస్థలకు 6,002 బస్సులు
- 3,200 వాటికే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు
- బస్సు సామర్థ్యంపై అనుమానాలెన్నో..
- దృష్టి సారించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



సాక్షి,సిటీబ్యూరో: విద్యాసంస్థల పునః ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా విద్యార్థుల రవాణాకు ఉపయోగించే వాహనాలకు సామర్థ్య పరీక్షలు నిర్వహించటంలో కొన్ని విద్యా సంస్థలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడి బస్సుల విషయంలో కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు నిర్లక్ష్యపు వైఖరి వీడటం లేదు. పాఠశాలలు ప్రారంభానికి ముందే సామర్థ్య పరీక్షలు పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు హెచ్చరించినా బేఖాతరు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలు, పర్మిట్లు, పన్నులు కట్టని విద్యాసంస్థలకు సంబంధించిన పలు బస్సులను రవాణా శాఖ సీజ్ చేస్తోంది. పాఠశాలల్లో చేర్పించే ముందు తల్లిదండ్రులు కూడా ఆయా విద్యాసంస్థల బస్సులకు సామర్థ్య పరీక్ష పూర్తైందా?, నిబంధనల ప్రకారమే నడుపుతున్నారా? లేదాన్న విషయంపై ఆరా తీయాల్సినా అవసరం ఉంది.

కఠినంగా వ్యవహరిస్తేనే..

విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల విషయంలో విద్యా సంస్థల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడంతో పాటు వాటి వివరాలను తెలుసుకోవాల్సి ఉంటోంది. ఈ విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యాసంస్థలకు సంబంధించిన బస్సులు, వాహనాలు మొత్తంగా 6,002 ఉండగా, ఇందులో ఇప్పటి వరకు 3,200 వాహనాలు రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వాహనాలకు ఫిట్ నెస్ పొందటానికి చూపుతున్న అలసత్వంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. విద్యార్థులకు జరగరాని ప్రమాదం ఏమైనా జరిగితే బాధ్యత ఎవ్వరు వహిస్తారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌నెస్‌కు ఇవి తప్పనిసరి

15 ఏళ్లు నిండిన వాహనాలను విద్యార్థుల రవాణాకు ఉపయోగించడానికి వీలులేదు. వాహనం పూర్తి కండిషన్లో ఉండాల్సి ఉంటోంది. విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్, పూర్తి అడ్రస్ బస్సు ఎడమవైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయించాలి. ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి. డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి చూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి మూడు నెలలకోసారి చేయించాల్సి ఉంటోంది. డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం తప్పనిసరిగా ఉండాలి. బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి. బస్సుకు సంబంధించిన విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్స్, పార్కింగ్ లైట్స్ ఉండాలి. టైర్లు కూడా కండిషన్‌గా ఉండాలి. ప్రతి వాహనంలో మంటలు ఆర్పే పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్‌కు విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం స్పష్టంగా కన్పించే విధంగా అద్దాలు అమర్చాలి. ప్రథమ చికిత్స పెట్టె, అటెండర్ ఉండాలి. ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమికి 325 మిల్లీ మీటర్ల ఎత్తును మించకుండా చూడాల్సి ఉంటోందని రవాణా శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

జయశంకర్ జీవితం ఆదర్శం



మల్లారెడ్డినగర్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్
- ఘనంగా ప్రొఫెసర్ వర్ధంతి
- నివాళులర్పించిన నేతలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ఆచార్య జయశంకర్ అని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆచార్య జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం గాజులరామారం డివిజన్ మల్లారెడ్డి కాలనీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమస్యకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే పరిష్కారమని నమ్మి ప్రజలను చైతన్యపరిచిన మహోన్నత నాయకుడు అని అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా మనందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం సీనియర్ నాయకుడు కస్తూరి బాల్‌రాజ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రాంరెడ్డి, కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, ఆంజనేయులు, సమ్మయ్య యాదవ్, సుంకరి చందు, చిన్నా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో బీఆర్ఎస్ ఎస్ఎంసీ అధ్యక్షులు వాకలపూడి రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సాంబశివారెడ్డి, స్టాలిన్‌రెడ్డి, తోట బిక్షపతి, ముత్యాలు కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, బలరాం, శివ, కోమటి శ్రీను, అరుణ్, సరస్వతి, స్వర్ణ కుమారి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్పలో నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నివాళి అర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ కలలు గన్న తెలంగాణ కోసం మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుడు అశోక్‌రెడ్డి అన్నారు. షాపూర్ నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధి కోసం, ప్రజల కోసం మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉంటుందని భవిష్యత్ ముందే ఊహించి చెప్పారన్నారు. ఆయన చెప్పినట్లుగానే తెలంగాణ వచ్చాక కూడా ప్రజల ఆకాంక్షలు ఏ మాత్రం నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి, సూరం నరసింహులు, జానయ్య, సిద్ధిరాములు, ఎర్ర వీరన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు తదితరులు

మంత్రి శ్రీధర్ బాబు

కుత్బుల్లాపూర్: నేత్ర సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన సాలీస్ నేత్ర వైద్యశాల నూతన శాఖను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొంది, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేత్ర పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న సాలీస్ ఆసుపత్రి వైద్య సేవలను పేద ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. అనంతరం సాలీస్ నేత్ర వైద్యశాల చైర్మన్ నందనంపాటి రామాంజనేయులు మాట్లాడుతూ.. డయాబెటిక్ రెటినోపతి, కాటరాక్ట్, నీటి కాసులు (గ్లకోమా), చిన్నపిల్లలో వచ్చే మయోపియా నేత్ర సంబంధిత వ్యాధులకు అత్యాధునిక లేజర్ చిత్సలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, డీసీపీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, కేపీ వివేకానంద్, లక్ష్మారెడ్డి, గంధ్ర సత్యనారాయణ రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, బేతి సుభాష్ రెడ్డి, మద్దాలి గిరిధర్ రావు, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి, నేతలు కొలను హన్మంతరెడ్డి, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా నిధుల పంపిణీలో ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని బీజేపీ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన ప్రభుత్వం జిల్లాలోని మేడ్చల్, దుండిగల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల్లోని రైతులకు ఎందుకు విడుదల చేయలేదో వివరించాలని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాలను సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసినప్పటికీ.. ఇవన్నీ గ్రామీణ ప్రాంతంగానే ఉన్నాయన్నారు. ఇక్కడి రైతులే కూరగాయలు, ధాన్యం, పప్పులు, ఇతర వాణిజ్య పంటలు పండిస్తూ.. నగరానికే అన్నం పెడుతున్నారన్నారు.

నేడు సంకల్ప సభ

మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ పదవీ కాలానికి ఏడాది పూర్తైన సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్స్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప సభ కరపత్రాన్ని విడుదల చేశారు.



మాట్లాడుతున్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

భక్తిశ్రద్ధలతో కట్టమైసమ్మకు బోనాలు



కట్టమైసమ్మ ఆలయం వద్ద బోనాలతో మహిళలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని కట్టమైసమ్మ కల్యాణోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయం వద్దకు బోనాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అక్కడ పుట్టమన్ను తీసుకువచ్చి పూజలు చేశారు. కాలనీవాసులే కాకుండా చుట్టు పక్కల కాలనీల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి కల్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం, రాత్రి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని కనకదుర్గ ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే వ్రతాల్లో పాల్గొనదలిచే భక్తులు 7386719214 నెంబరులో సంప్రదించాలని ఆలయ అర్చకులు కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేషన్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల క్లీనింగ్, మూతలు లేని మ్యాన్‌హోల్స్‌లను గుర్తించి వెంటనే రిపేర్ చేయాలన్నారు. వీధి వ్యాపారులకు పాసులతో పాటు నియమనిబంధనలను ఏర్పాటు చేసి ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్టలో యోగా చేస్తున్న సాధకులు



షాపూర్‌నగర్‌లో యోగాలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ సత్యనారాయణ

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ 2వ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, వీధి దీపాలు ఇతర పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. అనంతరం స్థానికులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, రఫియా బేగం, వీరబాబు, కొలన్ జీవన్‌రెడ్డి, అంబారెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, యోగా కేంద్రాల్లో, కాలనీలు, బస్తీల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేశారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, తగ్గే వ్యాధులపై యోగా గురువులు తమ విలువైన సందేశాన్నిచ్చారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు.
– కుత్బుల్లాపూర్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



సుచిత్రలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



భాగ్యలక్ష్మి కాలనీలోని నేతాజీ స్కూల్‌లో..



సుభాష్‌నగర్‌లోని బోధివృక్ష ఒలంపియాడ్ స్కూల్‌లో..



సూరారం మల్లారెడ్డి వైద్య కళాశాలలో..



చింతల్‌లోని బీపీఎస్ ఒలంపియాడ్ స్కూల్‌లో..



అపురూపా కాలనీలోని సత్యవాణి హైస్కూల్‌లో..



కొంపల్లిలోని డ్రీఫిట్‌నెస్ జిమ్‌లో..

ఎంఎల్ఆర్ఐటీకి మూడు సీఎస్ఐ అవార్డులు



అవార్డు అందుకుంటున్న బలరాం

దుండిగల్: కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఎక్సలెన్సీ అవార్డ్స్ 2025లో దుండిగల్‌కు చెందిన ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సత్తాచాటింది. ఘట్‌కేసర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఘట్‌కేసర్‌లో జరిగిన కార్యక్రమంలో అత్యధిక విద్యార్థుల సంఖ్య కలిగిన విద్యా సంస్థగా ఎంఎల్ఆర్ఐటీ ఎంపికై ప్రిన్సిపాల్ డాక్టర్ కె..శ్రీనివాస రావు, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అవార్డును సీఎస్‌సీ విభాధిపతి డాక్టర్ బలరాం, అత్యుత్తమ సీఎస్ఈ ఫ్యాకల్టీ వాలంటీర్ అవార్డును అధ్యాపకులు వేద విద్యాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫ్యాకల్టీని అభినందించారు. అత్యుత్తమ ప్రమాణాలతో ఉన్నత విద్యను అందిస్తున్నామని, తమ కృషికి తగిన ప్రతిఫలం లభించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్లు దీరేన్ రెడ్డి, అనుశ్రేయా రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి పాల్గొన్నారు.